


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఫరీజ్

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ సోమవారం 9 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కలిశారు.




# విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోని ప్రభుత్వం

**బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఫరీజ్**

ఎదులాపురం, డిసెంబర్ 8 : బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ స్థాపించిన గురుకులాలను నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్నదని, దాని కారణంగా విద్యార్థులు మరణిస్తున్నా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఫరీజ్ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురుకుల బాటలో గుర్తించిన పలు సమస్యలను తెలియజేశారు. ఉట్నూర్ మైనార్టీ గురుకులంలో విద్యార్థులు చర్మవ్యాధులతో బాధపడుతున్నారన్నారు. కేసీఆర్ గుర్తులను చెరిపేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి దానికి అనుగుణంగా గురుకులాలను నిర్వీర్యం చేయడంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. వాంకిడిలో ఫుడ్ పాయిజన్ ఘటనలో విద్యార్థి మృతి సంచలనంగా మారిందని, రాష్ట్రంలో 48 మంది వరకు విద్యార్థులు చనిపోయారని గుర్తు చేశారు. గురుకులాల బాట ద్వారా గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అప్పటికి పరిష్కారం కాకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుమార్, వాగ్మారే ప్రశాంత్, జెంగిలి ప్రశాంత్, సోయబ్, సలీం, ఆలం, రాజేశ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయమైన తారు రోడ్డు



పూర్తిగా తారుపోయి కంకర తేలిన రోడ్డు

# దారిద్ర్యం

- అడుగుకో గుంత.. ప్రయాణికులకు చింత..
- అధ్వాన్నంగా గోడిసేర్యాల తారురోడ్డు
- అటవీ శాఖ అనుమతులు లేక ఆగిన పనులు

దస్తురాబాద్, డిసెంబర్ 8 : రేవోజిపేటలోని కుమ్రం భీం చౌరస్తా నుంచి గోడిసేర్యాల గ్రామానికి వెళ్లే దారిలో మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వర్షాలకు తారు లేచి అధ్వానంగా మారింది. దీంతో భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందులకు గురి అవుతున్నారు. అలాగే గోడిసేర్యాల గ్రామ శివారులో ఉన్న శ్రీ రాజరాజేశ్వర ఆలయానికి వివిధ జిల్లాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. అలాగే గ్రామస్తులు జన్నారం, కడెంలకు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు నడపడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి తారురోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

## అటవీ శాఖ అనుమతులు లేక ఆగిన పనులు

రేవోజిపేట కుమ్రం భీం చౌరస్తా నుంచి గోడిసేర్యాల గ్రామానికి మూడు కిలోమీటర్ల బీటి రోడ్డు వర్షాలకు దెబ్బతినడంతో రెండేండ్ల క్రితం రూ.1.36 కోట్లతో మరమ్మతుల కోసం అప్పటి తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజురు చేసింది. 400 మీటర్ల వరకు సీసీ రోడ్డు, ఎనిమిది నూతన కల్వర్టులను నిర్మించారు. కాగా.. ఈ రోడ్డు అటవీ శాఖ పరిధిలో వస్తుందని, అటవీ శాఖ అధికారులు ఈ రోడ్డు మరమ్మతు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కాగా.. అటవీ శాఖ అధికారులు అనుమతుల కోసం కొలతలు తీసుకెళ్లారు. ఇంకా రోడ్డు పనులు ప్రారంభించలేదు. అటవీ, పంచాయతీ శాఖ అధికారుల సమన్వయలోపంతో బీటీ రోడ్డు మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతున్నది. వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తొందరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి విభాగం నాయకులు

# గురుకులాల నిర్వహణ అస్తవ్యస్తం

- కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరవాలి..
- విద్యా వ్యవస్థ సర్వనాశనం
- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ధ్వజం

సోన్, డిసెంబర్ 8 : కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది పాలనలో సాధించిందేమి లేదని, విద్యా రంగాన్ని తీవ్రంగా భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు కోదాటి నాగేందర్‌రావు, బలేముల అవినాశ్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు మరణిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని దుయ్యబట్టారు. గురుకులాలు, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నాణ్యమైన ఆహారం విద్యార్థులకు అందించగా.. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. ఆయా పాఠశాలల్లో హాస్టల్ వసతి సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనబడుతుందన్నారు. యేడాది పాలనలో సాధించింది ఏమి లేకున్నా విజయోత్సవాలు జరుపుకోవడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు సంధిస్తున్న ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద సమాధానాలు లేవని విమర్శించారు. సమస్యలపై స్పందిస్తున్న విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేస్తోందని వాపోయారు. కేసులకు బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు భయపడే ప్రసక్తే లేదని, సమస్యల పరిష్కారమయ్యే వరకు పోరాట పంథా వీడేది లేదని స్పష్టం చేశారు. ఆనాడు ఉద్యమ సమయంలో కూడా ఇదే స్ఫూర్తితో పోరాటం చేశామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాముతోపాటు విద్యార్థి విభాగం నాయకులు ఆదుముల్ల విశాల్, హరీశ్, రవికృష్ణ, ఆకాశ్ సింగ్, సందీప్, రిజ్వాన్, నహీం పాల్గొన్నారు.



బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తో శబరిమాత భక్తులు

# ఎమ్మెల్యేను కలిసిన శబరిమాత భక్తులు

నేరడిగొండ, డిసెంబర్ 8 : బుద్ధికొండ, తేజాపూర్ గ్రామానికి చెందిన శబరిమాత భక్తులు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. శ్రీశ్రీశ్రీ పరమహంస సచ్చిదానంద సద్గురు శబరిమాత ఆశ్రమంలో ఈ రోజు నుంచి 12 వ తేదీ వరకు జరిగే ఆశ్రమ వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమం వద్ద జరిగే వార్షికోత్సవ కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమానికి రూ.25 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, ఆశ్రమ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# చిరు జల్లులతో పరేషాన్

బోథ్, డిసెంబర్ 8 : బోథ్ మండలంలో రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న చిరు జల్లులకు రైతులు పరేషాన్ అవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం చిరు జల్లులు కురవడంతో రైతులు, జిన్నింగ్ పరిశ్రమల వారు ఆందోళనకు గురయ్యారు. జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో పత్తి నిల్వలు తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్‌లు కప్పారు. పత్తి బుగ్గలు తడిచిపోయి నాణ్యత ఎక్కడ కోల్పోతాయోనని రైతులు ఆందోళన చెందారు. మరోవైపు బోథ్ మార్కెట్ యార్డులో లారీల కొరతతో సోయాబిన్ సంచులు లోడింగ్ కాక మిగిలి ఉన్న రైతులు చిరు జల్లులతో ఆందోళన చెందారు. సోయాబిన్ తడవకుండా ఉండేందుకు టార్పాలిన్‌లు కప్పారు.

## అకాల వర్షంతో పంటకు నష్టం

ఇచ్చోడ, డిసెంబర్ 8 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో ఆదివారం ఈదురుగాలుతో కూడిన వర్షం కురిసింది. సిరికొండ మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రైతు వేసిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యాడు. నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.



బోథ్‌లోని జిన్నింగ్ ఫ్యాక్టరీలో పత్తి కుప్పలపై టార్పాలిన్ కప్పుతున్న కూలీలు

# పులుల రక్షణకు ప్రత్యేక చర్యలు

**పీసీసీఎఫ్ డోబ్రియల్**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 8 : జిల్లాలో పులుల సంచారం పెరిగిన నేపథ్యంలో వాటి సంరక్షణకు, ఆవాసానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ డోబ్రియల్ పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ఆదివారం వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్, సీసీఎఫ్ రామలింగంతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల నుంచి పులుల రాక పెరిగిందని, ప్రస్తుతం ఆవాసం కోసం వెతుకుతున్నాయని తెలిపారు. పులి ఆవాస కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రానున్న రోజుల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పులి, ఏనుగు దాడుల్లో పలువురు చనిపోవడం బాధాకరమన్నారు. అటవీ సిబ్బందికి ఆయుధాలివ్వడంపై ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించినట్లు తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల సర్వేపై అడుగగా, సర్వే చేయాల్సిన అవసరం లేదన్నారు. పులులపై వదంతులు ప్రచారం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో వినయ్‌కుమార్ సాహూ, ఎఫ్ఆర్వోలు గోవింద్ సింగ్ సర్దార్, సరోజా రాణి, జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# సూపర్ మార్కెట్ దొంగల ముఠా అరెస్టు

- ముఠాలో ఇద్దరు ఆడవాళ్లు, మైనర్ బాలుడు
- రూ.2.41లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ సాయినాథ్



వివరాలను వెల్లడిస్తున్న జైనథ్ సీఐ సాయినాథ్

బేల, డిసెంబర్ 8 : సూపర్ మార్కెట్‌లో ఈ నెల 4వ తేదీన జరిగిన భారీ చోరీ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. ఆదివారం బేల పోలీస్ స్టేషన్‌లో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, బేల ఎస్ఐ దివ్య భారతితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని శ్రీకర్ సూపర్ మార్కెట్లో ఈనెల4వ తేదీన భారీ చోరీ జరిగింది. ఇందులో రూ.5.45 లక్షలు చోరీకి గురయ్యాయి. సూపర్ మార్కెట్ యజమాని స్వరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఛేదించడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. చోరీ జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, సీసీ ఫుటేజ్ ఆధారంగా, ఇతర సాంకేతిక ఆధారాలతో నాలుగు రోజుల్లో కేసు ఛేదించారు. బేల బస్టాండ్ ప్రాంతంలో ఇట్టి ముఠాను పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది ఉన్నట్లు గుర్తించారు. ఇందులో రాజనాసి రాథోడ్, అభిషేక్ సింగ్ రాథోడ్, షారూఖ్, తాహిర్, రుషి, బిజిలాబాయి, హీరాబాయి, ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.2.41 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మిగతా డబ్బులు మధ్యప్రదేశ్‌కు చెందిన అప్పాన వద్ద ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరందరు మావల మండల పరిధిలోని ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని కుటుంబంతో సంచార జీవితం చేస్తు ఉంటారు. చుట్టూ పక్కల ఊర్లలో పెద్ద మార్కెట్, సంత, జాతరలో చిన్నచిన్న వస్తువులు అమ్ముకుంటు అక్కడక్కడ దొంగతనాలు చేస్తుంటారు. వీరిపై సిద్దిపేట, సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్ జిల్లాల్లో దొంగతనం కేసులు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. సీసీఎస్ సిబ్బంది రుక్మారెడ్డి, జాకీర్, జోగేందర్ సింగ్, నరేశ్, శ్రీనివాస్, రహత్, బేల సిబ్బంది జీవస్ కుమార్, సలీం, ప్రభాకర్‌లను ఎస్పీ గౌష్ ఆలం అభినందించారు.



జన్నారం మార్కెట్ యార్డులో వరదలో కొట్టుకుపోతున్న వడ్లు

# 'అకాల' నష్టం

- వర్షాలకు తడిసిన ధాన్యం, పత్తి
- అన్నదాతల్లో ఆందోళన



నెన్నెల : మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

నెన్నెల/వేమనపల్లి/భీమారం/దండేపల్లి(జన్నారం)/దహెగాం, డిసెంబర్ 8 : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతన్నలకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయి. నెన్నెల మండలంలో కల్లాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తడంతో అన్నదాతలు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. వేమనపల్లి మండలం జిల్లెడ, బుయ్యారం, సూరారం తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. పలుచోట్ల వరిధాన్యం, చేలల్లోని పత్తి తడిసి ముద్దయ్యింది. అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భీమారం మండలం నర్సింగాపూర్, భీమారం, దాంపూర్, ధర్మారం, రెడ్డిపల్లి, కొత్తపల్లి, మద్దికల్ గ్రామాల్లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసింది. జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తూకానికి ఉన్న ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు వేడకుంటున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలో శనివారం రాత్రి కురిసిన వానకు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోగా, కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరిగింది. అనేక చోట్ల పత్తి తడిసి రంగు మారింది.

# జీసీసీ మేనేజర్ సస్పెన్షన్?

కాగజ్‌నగర్, డిసెంబర్ 8 : కాగజ్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి జీసీసీ మేనేజర్ బొజ్జ నాయక్ సస్పెన్షన్ అయినట్లు తెలుస్తున్నది. జీసీసీకి చెందిన సరుకులు పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్ జీసీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయనను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించినట్లు తెలిసింది. ఆసిఫాబాద్ జీసీసీ మేనేజర్ బొజ్జ నాయక్‌కు కాగజ్‌నగర్ జీసీసీ ఇన్‌చార్జి మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఆసిఫాబాద్ జీసీసీకి చెందిన సరుకులు పట్టణంలోని డాడానగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో దింపుతుండగా యువకులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా, పోలీసులు అక్కడికి చేరుకొని ఆ సరుకుల వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరుసటి రోజు పోలీసులు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించగా, వారు ఆ వాహనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ సైతం పట్టుబడిన జీసీసీ సరుకులపై విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. విచారణ వివరాలు, పట్టుబడిన జీసీసీ సరుకుల వివరాలు వెల్లడించకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకుండానే ఆ వాహనాన్ని జిల్లా కేంద్రానికి తరలించడంతో ఇరు శాఖల అధికారులపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న జీసీసీ చైర్మన్ కోట్నాక్ తిరుపతి కొద్ది రోజుల క్రితం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ జీసీసీ కార్యాలయాలను, గోదాములను తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో అవినీతికి పాల్పడినట్లు తేలడంతో సదరు మేనేజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి చేసినట్లు తెలుస్తున్నది. ఈ విషయమై డీఎం రామానందంను వివరణ కోరగా.. సస్పెన్షన్ విషయం నా దృష్టికి రాలేదన్నారు.



హాజరైన విద్యార్థులు



విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టు సాంబమూర్తి

# జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

బాసర, డిసెంబరు 8 : బాసర ట్రిపుల్ ఐటీలో ఆదివారం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాస నిపుణులతో వ్యక్తిత్వ వికాసం, పరీక్షల సన్నద్ధపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకాలజిస్టు, వ్యక్తిత్వ వికాస నిపుణులు సాంబమూర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు భయాందోళనకు గురి కావద్దని, ప్రశాంతతో కూడిన ఆలోచనలు కలిగి ఉండాలని, లక్ష్యంపై దృఢ నిశ్చయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే ముందుగా కృషి, పట్టుదలతో దానికి సంబంధించి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం వివరించారు. ప్రభావవంతమై పరీక్షల తయారీ కోసం అధ్యయన ప్రణాళికలను రూపొందించడం, క్రమం తప్పకుండా సాధన చేయడం, సమయ నిర్వాహణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం వంటి ప్రాముఖ్యతను వివరించారు. జీవితంలో విజయాన్ని సాధించడంలో గ్రోత్‌మైండ్ సెట్‌ను పెంపొందించుకోవడం, పనులకు ప్రాధాన్యత ఇవ్వడం, సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ప్రాముఖ్యతను పరీక్షలకు సన్నద్ధత అంటే కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాదు, జీవితంతో విజయం సాధించడంలో మీకు సహాయపడే నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విఠల్, సమన్వయ కర్త డాక్టర్ రాములు, డాక్టర్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.